క్లుప్తంగా

గోశాలలో చండీహోమం

టేకుమట్ల : మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో వరంగల్ వాస్తవ్యులు తాటికొండ చక్రపాణి నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి గోశాలలో డిసెంబర్ 1న చండీయాగం నిర్వహిస్తున్నట్లు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గొరిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలతసురేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత యేడాది నిర్మించిన గోశాలలో డిసెంబర్ 1న గణపతి హోమం, చండీహోమంతో పాటు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట ఆలయ గౌరవ అధ్యక్షులు మారం సరోత్తంరెడ్డి ఉన్నారు.

ఓటర్లకు డబ్బులు పంచిన నేతలు

మంగపేట: మండలంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓట్ల కోసం బుధవారం ఓటర్ల ఇంటింటికి తిరిగి డబ్బులను పంచారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒక్కో ఓటుకు కొంత చొప్పున 100 మంది ఓటర్లకు ఒక్కొక్కరికి బాధ్యతలు అప్పగించి ఓటరు స్లిప్పుతో పాటు డబ్బులు పంపిణీ చేసినట్లు బహిరంగ ప్రచారం. ఇదిలా ఉండగా వివిధ గ్రామాల్లో కొందరు నాయకులు వారికి అనుకూలమైన వారి ఇంటికి వెళ్లి డబ్బులు ఇచ్చి పక్కింటి వారికి డబ్బులు ఇవ్వకుండా వెళ్లడంతో ఓటర్లు తాము ఓటర్లం కాదా తమకెందుకు ఇవ్వకుండా వెళ్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు నేతలు పలు యూనియన్ల నాయకుల ఆధ్వర్యంలో ఆయా యూనియన్ల సభ్యులకు విందు ఏర్పాటు చేశారు.

రూ.లక్షలు కాజేసిన నాయకులు

సందడిలో సడేమియా అన్న విధంగా ఓటర్లకు డబ్బులు పంచేందుకు ఆయా పార్టీల నాయకుల నుంచి కొందరు చోటా మోటా నాయకులు రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని ఓటర్లకు పంచకుండా ముఖం చాటేసినట్లు సమాచారం. ఓటర్లకు డబ్బులు పంచకుండా కాజేసిన నాయకులను గట్టిగా అడగలేక చేసిన మోసాన్ని బయటకు చెప్పుకోలేక తేలు కుట్టిన దొంగల్లా లోలోన బాధపడుతున్నట్లు సమాచారం.

అడుగడుగునా పోలీసులే..



ఏటూరునాగారం: ములుగు జిల్లా ప్రాంతం మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడంతో ఎన్నికల సమయంలో ఏదైనా దుశ్చర్యకు పాలప్డే అవకాశం ఉందని పోలీసులు ముందస్తుగా జిల్లా కేంద్రంలోని ఈవీఎంల పంపిణీ కేంద్రం నుంచి మారుమూల ప్రాంతాలకు చేరే రూట్లలో అడుగడుగునా పోలీసులను మోహరించారు. 163వ జాతీయ రహదారి కల్వర్టుల వద్ద కేంద్ర సీఆర్‌పీఎఫ్ బలగాలతో పహారాను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా దట్టమైన అటవీ ప్రాంతాలకు ఈవీఎంలను తీసుకెళ్లే బస్సులను ఎస్కార్ట్‌లతో తీసుకెళ్లి పోలీసులు గమ్యాలకు ఈవీఎంలను చేర్చారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా కల్వర్టులు, బ్రిడ్జిలు, అనుమానిత ప్రాంతాల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

టేకుమట్ల : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సాయంత్రమే ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేశారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఆర్‌పీఎఫ్ బలగాలు ముందస్తుగానే మోహరించగా చిట్యాల సీఐ వేణుచందర్, ఎస్సై గట్ల సుధాకర్ బందోబస్తు నిర్వహించారు.

మహదేవపూర్: మండలంలోని మొత్తం 34 పోలింగ్ కేంద్రాలకు గాను ఒక్కో పోలింగ్ కేంద్రానికి పోలింగ్ అధికారి అసిస్టెంట్ పోలింగ్ అధికారి ఇద్దరు సిబ్బంది ఇద్దరు పోలీసులతో పాటు నలుగురు అబ్జర్వర్లు మొత్తం 208 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు తహసీల్దార్ లక్ష్మి రాజయ్య తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించు కోవాలని తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

భూపాలపల్లి రూరల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది బుధవారం తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఎన్నికల సిబ్బందికి అధికారులు ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు, తదితర సామగ్రి అప్పగించారు. దీంతో అధికారులు, సిబ్బంది సామగ్రిని తీసుకొని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో బయలుదేరారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది.



భూపాలపల్లి అర్బన్ : పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌కు సర్వం సిద్ధం

కాటారం: అసెంబ్లీ ఎన్నికలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. గురువారం ఉదయం నుంచి పోలింగ్ ప్రారంభం కానుండటంతో అధికారులు, సిబ్బంది ఈవీఎంలతో బుధవారం సాయంత్రం మండలంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఉండగా అధికారులు పోలింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లు తమ ఓటు వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 36 పోలింగ్ కేంద్రాల్లో 36 మంది ప్రిసైడింగ్, 36 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 72 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. వీరితో పాటు ఐదు సెక్టార్లకు ఐదుగురు సెక్టార్ ఇన్‌చార్జ్‌లు, మైక్రో అబ్జర్వర్లు విధుల్లో ఉండనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను వీడియో రికార్డు చేయనున్నారు. మండలంలో మొత్తం 28,783 మంది ఓటర్లు ఉన్నారు.



బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎస్సై సుధాకర్

27 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

మహాముత్తారం : మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో స్త్రీలు, పురుషులు కలుపుకొని 20,100 ఓట్లు ఉండగా వారికి సరిపడా ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు.

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

చిట్యాల: అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ సుమన్, ఎంపీడీఓ రామయ్య బుధవారం తెలిపారు. మండలంలోని మొత్తం 25 గ్రామ పంచాయతీల్లో 35 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలను సమకూర్చినట్లు తెలిపారు. చిట్యాలను సమస్యాత్మక మండలంగా ఎన్నికల అధికారులు గుర్తించి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారన్నారు. ఎన్నికల సమయంలో కేంద్ర పోలీసుబలగాలను ఏర్పాటు చేసి, బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ వేణుచందర్, ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు.



మహదేవపూర్ : పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



కాటారం : పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న పోలింగ్ అధికారులు



వెలిశాలలో...



ద్వారకపేటలో...



భూపాలపల్లి రూరల్ : వాహనంలో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన అధికారులు, సిబ్బంది



టేకుమట్ల : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అధికారులు

చెక్‌పోస్ట్ వద్ద విస్తృత తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై నరేశ్

మల్హర్ : ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మండలంలోని కొయ్యూరు పెట్రోల్‌బంకు సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద కొయ్యూరు పోలీసులు బుధవారం విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కాటారం–మంథని వైపు వెళ్తున్న వాహనాలను ఎస్సై వడ్లకొండ నరేశ్ ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. వాహనాల్లో అక్రమంగా మద్యం, డబ్బులు తరలించకుండా తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.

అటెండర్ కుటుంబానికి అండగా ఉంటాం



ఏటూరునాగారం: పీఏసీఎస్ సొసైటీ అటెండర్ కుటుంబానికి అండగా ఉంటామని పీఏసీఎస్ కార్యదర్శి గౌరమ్మ అన్నారు. పీఏసీఎస్ మహ్మద్ దార్ సాహెబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మండలంలోని రామన్నగూడెంలో బాధిత కుటుంబాన్ని పీ ఏసీఎస్ ఉద్యోగులు, సిబ్బంది పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. జీఓ నంబర్ 44 ప్రకారం రూ. 15వేలు సంఘం తరపున అందజేశామన్నారు. అలాగే బా ధిత కుటుంబానికి పీఏసీఎస్ కార్యదర్శులు కలి సి రూ.10వేలు అందజేశామన్నారు. కార్యక్రమంలో తిరుపతి, దిలీప్, శంకరయ్య, తిరుపతి, స్వాతి, బుజ్జి, రంగారావు, సత్యానారాయణ అందజేశారు.







అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు భూపాలపల్లిలో పలు పోలింగ్ కేంద్రాలను ఆదర్శపోలింగ్ కేంద్రాలుగా ముస్తాబు చేశారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నక్సల్స్ ప్రాంతాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

ఏటూరునాగారం : నెలరోజులుగా ఆయా పార్టీలు నువ్వా నేనా అన్నట్లుగా పోటీ పడగా నేటి పోలింగ్‌తో వారి వారి బలబలాలు తేలనున్నాయి. గురువారం జరిగే పోలింగ్ కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 28 పోలింగ్ కేంద్రాలు , కన్నాయిగూడెం మండలంలో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారులు తహసీల్దార్ సృజన్, ఎంపీడీఓ కుమార్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను సమకూర్చారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు, విద్యుత్‌తో పాటు మిగిలిన అన్ని సౌకర్యాలను కూడా అధికారులు కల్పించారు. ములుగులో పోలింగ్ బూత్‌ల వారీగా కేటాయించిన పోలింగ్ అధికారులు ఈవీఎంలు, సామాగ్రి, ఈవీఎం ప్యాడ్‌లను చేతపట్టుకొని వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు పోలీసుల ఎస్కార్ట్ వాహనంతో ప్రైవేటు బస్సుల్లో సాయంత్రం 6 గంటలకు చేరుకున్నారు. అంతేకాకుండా ఉదయం 6 గంటలకు మాక్‌పోలింగ్ నిర్వహించి ఈవీఎంలను పరిశీలిస్తారు. ఏదైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే వాటి స్థానంలో నూతనవి మార్చేందుకు సెక్టార్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి అధికారులు భద్రత చర్యలు చేపట్టారు.

నక్సల్స్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు

ఏటూరునాగారం మండలంలోని కొండాయి, ఐలాపూర్, మల్యాల, కొత్తూరు, సర్వాయి, తుపాకులగూడెం, బాలాజీ బంధంలతో పాటు కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల, కన్నాయిగూడెం , ముప్పనపల్లి, ఏటూరు, సింగారం గ్రామాల్లో కూడా పోలీస్ బలగాలు పెద్ద ఎత్తున మొహరించి భారీ భద్రత చర్యలు చేపట్టారు. ఇప్పటి నుంచే అనుమానిత వ్యక్తుల్ని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు చెందిన ఈవీఎంలతో సిబ్బంది బుధవారం చేరుకున్నారు. మండలంలోని 14 బూత్‌లు ఉండగా అన్ని బూత్‌లకు చెందిన బాక్స్‌లను ప్రత్యేక వాహనంలో బూత్‌ల వద్దకు చేర్చి ప్రత్యేక పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్‌కు కావలసిన ఏర్పాట్లు అధికారులు సిద్ధంగా ఉంచారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు

వాజేడు: పోలింగ్ సిబ్బంది, ఈవీఎంలతో బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరారు. భద్రాచలం అసెంబ్లీ పరిధిలో వాజేడు, వెంకటాపురం(కె) మండలాలు ఉండటంతో భద్రాచలం నుంచి బస్సుల్లో సిబ్బందిని, ఈవీఎం మిషన్లను ఎన్నికల అధికారులు తరలించారు. దారి పొడవునా పోలీసులు భద్రత కల్పించారు.

మంగపేట: మండలంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం జరుగనున్న ఎన్నికల నిర్వాహణకు సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 46 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహించేందుకు ఒక్కో పోలింగ్ కేద్రానికి నలుగురు సిబ్బంది చొప్పున 184 మంది సిబ్బంది ఎన్నికల సామాగ్రితో బుధవారం ప్రత్యేక బస్సుల్లో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన 27 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వార ఎన్నికలు నిర్వహించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మండంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఎంపీడీఓ శ్రీధర్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆఫీసర్ (సెర్ప్ డీఆర్‌డీఏ అడిషనల్ డీఆర్‌డీఓ బాలస్వామి బుధవారం పరిశీలించారు.పోలింగ్ కేంద్రాల్లో సెర్ప్ వీఓఏల ద్వారా దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక వాహన సదుపాయం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వలంటీర్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీఓ మమత, ఐకేపీ ఏపీఎం మమత, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీ, వీఓఏలు పాల్గొన్నారు. మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వాహణకు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సీసీఐ మండల రాజు పర్యవేక్షణలో 300 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై గోదరి రవికుమార్ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని 46 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన మంగపేట, కమలాపురం, సీపీనగర్, మల్లూరు, రమణక్కపేట, రాజుపేట తదితర కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరుగకుండా సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఇప్పటికే సీఆర్‌పీఎఫ్, ఓడీఎల్‌డబ్ల్యూటీ, హోంగార్డు సివిల్ పోలీసు బలగాలతో పెట్రోలింగ్ ప్రారంభించామన్నారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిడి, ప్రలోభాలకు లొంగకుండా ఎవరి ఒత్తిడి లేకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.



పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలతో వస్తున్న సిబ్బంది



పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు



ఓటర్లకు నీడను కల్పించేందుకు ఏర్పాటు చేసిన టెంట్లు



వాజేడు: ఈవీఎంలతో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

ఏజెన్సీలో కోతుల బీభత్సం

ఎస్‌ఎస్ తాడ్వాయి : ఏజెన్సీలో కోతల బెడద తీవ్రంగా మారింది. కోతల బీభత్సంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలు కోతలతో సావాసం చేయాల్సి వస్తుంది. కనురెప్ప మూసి తెరిచే క్షణంలోనే ఆదమరిస్తే కోతులు ఇంట్లోకి ప్రవేశించి నానా బీభత్సం చేయడంతో పాటు వస్తువులు, వంటపాత్రలు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. బెదిరించే ప్రయత్నం చేసే వారిపై దాడులకు సైతం దిగుతున్నాయి. దీంతో ప్రజలు ఏమి చేయాలో ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

ఇళ్లు పీకి పందిరేస్తున్న కోతులు

కోతుల బెడదతో ప్రజలు బయటికి రావడానికే భయపడుతున్నారు. కనీసం వారిని ఇంట్లో కూడా ప్రశాంతంగా ఉండనీయట్లేవు. పెంకుటిళ్లు, గడ్డి గుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్న వారి పరిస్థితి వర్ణనాతీతం . ఇలాంటిపై ఎక్కి వాటిని తోచిన విధంగా ధ్వంసం చేస్తున్నాయి. ఇంటిల్లిపాది కూలీ పనులకు వెళ్లి వచ్చే సరికే ఇంటి పైకప్పు నుంచి ఇంట్లో దూరి ఇళ్లు పీకి పందిరేసినట్లుగా బీభత్సం చేస్తున్నాయి. మహిళలు ఆరుబయట వంటపాత్రలు శుభ్రం చేస్తున్న సమయంలో, ఏ మాత్రం కొంచెం ఆదమర్చి తలుపు తె ర్చి ఉంటే ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయి. అహారపాత్రలు కాపాడుకునే ప్రయత్నం చేస్తే వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి.

జనం కంటే కోతులే ఎక్కువ...

ఏజెన్సీ ప్రాంతాల్లో జనం కంటే కోతుల సంఖ్య నానాటికి విస్తరిస్తుంది. తాడ్వాయి ఏజెన్సీ అటవీ ప్రాంతం కావడంతో ఇప్పటికే లక్షలాది కోతులు గ్రా మాల్లో సంచరిస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో పట్టిన కోతులను ఇక్కడే అటవీ ప్రాంతంలో తీసుకువచ్చి వదిలేయడంతో అవి కూడా గ్రామాల్లోకి ప్రవేశిస్తూ ఇళ్లు, పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. పత్తి, వరి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నా యి. కిరాణ షాపు, మార్కెట్‌ల్లో నుంచి వస్తువులు కొనుగోలు చేసి తీసుకొస్తున్న తరుణంలో పిల్లలు, పెద్దలు తేడా లేకుండా కోతుల గుంపులుగా వచ్చి మూకుమ్మడి దాడి చేస్తున్నాయి. హరితహారంలో నాటిని మొక్కలకు వేసిన ఫెన్సింగ్‌లను సైతం పీకేసి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల బెడద తట్టుకోలేక కొన్ని గ్రామాల ప్రజలు కోతుల బెడద తప్పించిన వారికే ఓట్లు వేస్తామన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.



ఇంటిపై కప్పు ఎక్కుతున్న కోతుల గుంపు



హరితహారం మొక్కలకు వేసిన ఫెన్సింగ్ వద్ద కోతుల గుంపు

కోతుల బెడద తట్టుకోలేకపోతున్నాం..



ఇంట్లో ఉండాలన్న, బయటికి వెళ్లాలన్న కోతుల బెడదను తట్టుకోలేకపోతున్నాం. ఇంటిపై పెంకులను ధ్వంసం చేయడంతో రూ.4 వేలు పెట్టి కవర్ కొని కప్పినా కోతుల ఒక్కరోజు కూడా ఉంచలేదు. అధికారులు ఎవ్వరు కూడా పట్టించుకోవడం లేదు. ఈ సారి ఎన్నికల్లో కోతుల నివారణకు చర్యలు తీసుకున్న వారికే ఓటు వేయాలనే అభిప్రాయానికి వచ్చాం.

- తాళ్లపల్లి అరుణ, తాడ్వాయి

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వాజేడు: స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. మండల పరిధిలోని వాజేడు, ప్రగళ్లపల్లి, ఘణపురం, శ్రీరామ్ నగర్, ధర్మవరం, పేరూరు గ్రామాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సంఘ సెక్రటరీ సత్యనారాయణ తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధిపొందాలని కోరారు.